# పుణ్యాత్ముడైన పాపి మృత్యువు

పాపం, రాఘవయ్యగారు మృత్యు ముఖద్వారం వద్ద పడున్నాడు, ఆరునెల్లనుండి. ఆ ద్వారం రెక్కలు సహం మటుకే తెరుచుకుని - మాయగా - అలావుండిపోయినై, యీ ఆరు నెల్ల నుండి. ఆ రెక్కలు సాంతం తెరుచుకున్న సెకండ్ల మీద పాపం, రాఘవయ్యగారు పరలోకాల కెళ్ళిపోతాడు; పరలోకాలంటే ఒకటి స్వర్గం రెండోది నరకం.

రాఘవయ్యగారు ఒకవేళ చస్తే (యింకా జీవం వున్నవాణ్ణి కాస్తా - పాపం!) ఆయన స్వర్గాని కెళ్తాడా నరకానికెళ్తాడా అనే అంశంపై తర్కాలు కూడా (బహిరంగంగా కాదనుకోండి) కొందరు చేసి వున్నారు.

కాని 'రాఘవయ్యగారు చచ్చి, చచ్చినట్టు నరకాని కెళ్ళేది ఖాయమైనా ఆయనక్కడ నరకోద్యోగులకు లంచాలు పెట్టి 'స్వర్గానికి బదిలీ' చేయించుకోగలడని కొందరు తుచ్ఛులు ఒక ప్రచారం లేవతీశారనే వార్తలు కొందరి చెవిన పడినై కూడా.

వైద్య శాస్త్ర రీత్యా రాఘవయ్యగారు ఆరునెల్ల కిందటే 'చచ్చినవాడి కింద జమ' అని ఆయనకు వైద్యం చేస్తున్న ఆ ప్రఖ్యాత డాక్టరు స్పెషలిస్టులు నిర్ణయించారు. (తమలో తామేసుమండీ) ఒక వేళ తాము నిజంగా ఆరునెల్ల కిందటే 'రాఘవయ్యగారికి ఆశ లేదు' అని బహిరంగంగా చెప్పివుంటే కొంప మునిగి వుండేది! నలుగురి నోటా తమ వైద్యశాస్త్ర నిర్ణయం తప్పుడు రకమని ప్రచారమై తమ ప్రాక్టీసుల నోట గడ్డిమెత్తే వారు, యింకా నయం!

అయితే ఆ చచ్చినవాడు యిన్నాళ్ళూ ఏ అగోచర శక్తుల రక్షణలోనో యింకా బతుకుతూ నిక్షేపంగా ఆ పట్టె మంచంలో పడుండే తన వ్యాపార కార్యకలాపాలు ఎలా చకచక చేసుకుపోతున్నాడో యీనాటికీ అంతుపట్టక మెలికలు తిరిగి పోతున్నారు, ఆ ప్రముఖ డాక్టర్లు.

రాఘవయ్యగారు కొందరిచేత లక్షాధికారిగానూ యింకొందరి చేత కోటీశ్వరుడుగానూ గుర్తించబడిన వాడైవుంటంలో ఆయన రోగ స్థితిగతుల్ని గురించి అనేక వాకబులూ చర్చలూ సిద్ధాంతీకరణలూ కోలాహలంగా ప్రకటనలవుతూవుంటం అంత అసహజమేం కాదు.

"పాపం, రాఘవయ్య గారు ఎట్లా వున్నాడో, ఏమో మరి, మనకు నేరుగా తెలిచ్చావదాయె, ఎట్టచస్తాం!" అన్నారు వీధిజనంలో ఒకరు.

"మరి పాపం, ఆయన్ని ఆర్నెల్ల కిందటే కింద పెట్టారన్నారు, యింకా బతికే వున్నాడన్నమాట!" యింకోరన్నారు.

"నోరు మూయరా ఎదవా, ఎవరన్నా యింటే నీ పొళ్ళు రాలిపోను! ఆయన లచ్చాదికారి! పున్నెమాంటూ కొన్నివేల మంది పనోరు ఆయన సేతిమీన బతుకుతుండారు!" అన్నారు మరొకరు.

"ఆయనకు పెద్ద వ్యాపారాలున్నయ్! నలుగురికి పెట్టి తనకీ నాలుగురాళ్ళు మిగుల్చుకుంటాడు! మరి అందరికీ అట్లాంటి పనులు చెయటానికి చేతగాదే? అదృష్టవంతుణ్ణి చెరచాలేము, దురదృష్టవంతుణ్ణి బాగు చేయనూలేము!" అన్నాడింకో సౌమ్యుడు.

"అక్కర్లేదు, మీరాయనకు పన్లు చెయటం మానేస్తే ఆయనా నెత్తినో తట్టతో వచ్చీ మీ కూలీజనంలో చేర్తాడు!" అన్నాడో కాకీ నిక్కరు మనిషి.

"అదేం జరిగేది కాదు లేవయ్యా! ఇంతకు ముందో రెండుసార్లు పనికెల్దం బిగదీసేతలికి కొత్తోర్ని తెప్పిచ్చి మా పన్లు సేయించుకుండారు! కాదు గూడ్దని సబలు పెట్టేతలికి కీళ్ళు యిరగబొడ్చి కొట్టోపార్నూకారు! యిగనంతే యవారం సప్పపడింది" ఒక శ్రామికుడన్నాడు.

"సట్టం ఆరికి పలికినట్టు మనకి పలకదే మరి, ఏం జేత్తా?" యింకో శ్రామికుడన్నాడు.

"ఒరేయ్, దేనికిరా ఆ సచ్చే ఆయన్ని గురించి ఎల్లబోసుకుంటారు? ఆయన బాగా బతికుండప్పుడు అదేదో సివర్దాకా ఎలగబెట్టక పోయినారంట్రా." అనో తలనెరిసిన మనిషన్నాడు.

"సత్తాన్నాడు సత్తన్నాడని యీళ్ళు నోరు పారేసుకుంట వుండారేగాని, ఆ రాగవయ్యగారు యాపారాలెన్ని ముంగలకన్న బాగానే ఆ మంచం మీద పొడుకునే సెక్రం తిప్పుతుండాడంటగా." అన్నాడింకో ఆచూకీ తీసే మనిషి.

"ఓ వక్క ఏరోజుకారోజు ఆ డాకటేర్లు ఆయన గార్ని నూని తెల్లమొగాలేత్తుండారంటారు, యింకో వక్క యాపారెవారాలు మా బాగ నడుపుతుండారంటారు – యిదంతా ఏదో తికమకగా వుండదే?" అన్నాడింకో ఆచూకీదారు.

"డబ్బు సంచులొచ్చి వొళ్ళో కూకుంటం రుసి మరిగినోడు తను సత్తానని తెలవంగానే ఆ సంచుల్ని యింకాత్తె గెట్టిగా వాటేసుకుంటాడు!" అన్నాడో మనిషి.

"వెనక భీష్మాచార్యులవారికి ఓ వరం వుండేదిట, తను యిష్ట ప్రకారం చావటానికి! మన రాఘవయ్యగారికి అలాంటి శక్తులున్నయంటే నేనాశ్చర్యపడను!" అన్నాడో స్కూలు మాష్టారు.

"ఏమి యీ కలికాలం! రాఘవయ్య గార్ని ఎవరింత పల్లెత్తుమాట అన్నా వారి నోళ్ళు పురుగుల్న పడిపోతయ్! ఆయన పుణ్యాత్ముడు! ఆ మహాతల్లి బెజవాడ కనకదుర్గ ద్వారబంధానికి బంగారం పూత పూయించి ఆవిడకు రవ్వల ముక్కెర చేయించటం ఎవరెరగరూ? తిరపతి కొండ దార్లో నాలుగు చలివేంద్రాలు ఏర్పాటు చేయించలేదూ? ఎగువ తిరుపతి మీద ధర్మశాల కట్టించారే? రమణాశ్రమానికీ అరవిందాశ్రమానికీ కొన్ని వేలు దానం చేయలేదూ? శ్రీరామ నవమి వుత్సవాలకు ఏటా ఎన్నిసార్లు పందిళ్లు వేయించి అన్నదానాలు చేశారు! భగవాన్, ఆ రాఘవయ్యగారి సొమ్ము తింటూ ఆయన చావుకోర్తున్న కృతఘ్నులనెందుకు సృష్టిస్తావు? యీ ఘోరకలికి అంతం ఎప్పుడు?" అన్నాడు భక్తుడు.

* * *

ఈ దుష్ట ఘడియల్లో భూలోకంలోని రాఘవయ్య గారి మృత్యువు తాలూకా క్లిష్ట సంఘటన ఒక విషమ సమస్యగా స్వర్గ, నరకాధిపతుల శిరస్సులపై పిడుగల్లే టఫీమని పడింది!

స్వర్గ, నరకాధిపతుల ప్రత్యేక సలహాసంఘ సభ్యులైన ఒక దేవగణం మొత్తా అకస్మాత్తుగా హుటాహుటిన ఆ వుభయ లోకాధిపతుల ముందుకొచ్చి నుంచున్నారు.

ఓ స్వర్గ, నరకాధిపతులారా, మీ అజాగ్రత్త వల్ల మన దివ్యశక్తులపై ఒక అనిర్వచనీయమైన అప్రదిష్ట విరుచుకు పడింది! యిప్పటికైనా మీ కళ్ళు తెరవండి!" అని ఎలుగెత్తి పలికారా దేవగణ సలహా సంఘు సభ్యులు

'విషయం విశద పర్చండి!" అన్నారు ముక్తసరిగా స్వర్గ, నరకాధిపతులు, ఒకరి మొహాలొకరు చూసుకుంటూ.

"భూలోక వాసి రాఘవయ్య నామధేయుడనే మహాధనికుడు చచ్చీ చావకుండా మన మృత్యు కవాటం ముందు పడివున్నాడు! ధన్వంతరిని తలదన్నే భూలోకంలోని మహా మేధావులైన కొందరు డాక్టర్లు ఆ రాఘవయ్య నామధేయుణ్ణి మృతుడి కింద ఏకగ్రీవంగా పరిగణించారు! ఆ విధంగా పరిగణించబడిన ఆ మృతుడు తక్షణమే తెరువబడవలసిన మన మృత్యుకవాటం గుండా అటు స్వర్గానికో యిటు నరకానికో తమ నిర్ణయానుసారం చేరవలసి యుండెను. కాని సకాలంలో ఆ రాఘవయ్య నామధేయుడికి ఏ లోకప్రాప్తి కలగవలసిందీ తమ వుపేక్ష వల్ల నిర్ణయించబడక, మృత్యుకవాటం రెక్కలు తెరుచుకొనుట మధ్యలోనే ఆగిపోయి, మన దేవలోకాలపై పూర్వం

మనం కనీవిని ఎరుగని అప్రదిష్ట విరుచుకుపడింది! యిందుకు మీ సమాధానం ఏమిటి?" అని నిక్కచ్చిగా అడిగారా దేవగణ సభ్యులు స్వర్గ, నరకాధిపతుల్ని.

"ఓ విజ్ఞులారా, సర్వకాల సర్వావస్థల యందూ మెళుకువతో మెలిగే మీ అమోఘ దృష్టికి యీనాడైనా ఆ రాఘవయ్య నామధేయుడి స్థితి తెలిసి వచ్చినందులకు మేమెంతో సంతసించుచున్నాము!"

"పూర్వము కొంచెము యిలాగే దాదాపు యీ రాఘవయ్య నామధేయుడికి సంభవించిన సంఘటనల్లాంటి సమస్యనే మమ్ముల నెదుర్కొనుటా, వాటిని మేము – మీ దృష్టి పథాన పడకుండానే కావచ్చు – ఏదో విధంగా సర్దుబాటు చేసినటులగానూ తెలుపుచున్నందుకు మీరన్యథా భావించ నవసరం లేదు; కాని యీనాడు మీరీ కొత్త సమస్యను బహిరంగంగా మాముందుంచుచున్నందున మిమ్ముల సమాధానపర్చుట మా ధర్మమని భావించుచున్నాము.

"కాని నేడీ రాఘవయ్య నామధేయుడు తెచ్చిపెట్టి వున్న విషమ సమస్య లాంటి దానిని పూర్వం మేమేనాడు ఎరిగి వుండలేదు! యీ మానవుడు తన జీవితంలో కొన్ని వేల శ్రమజీవుల శ్రమ ఫలితాన్ని కృత్రిమ సాధన ద్వారా స్వాహా చేస్తూ కోట్ల ధనమార్జించిన మహా పాపిగా ఒక పక్క నవుతే యింకొక పక్క దేవస్థానాలకు ధర్మశాలలు గట్టించీ, దేవాలయ ద్వారములకు బంగారపు పూతలు పూయించీ, మూలవిరాట్టులకు ఆభరణాలు చేయించీ, దేవస్థానాల పర్వత మార్గముల యందు చలివేంద్రములు కట్టించీ, అన్నదానములు గావించీ, యిత్యాది దైవ ప్రీతి పొందే పుణ్యకార్యములు చేసినవాడైనందున మేము తగు మాత్రపు చిక్కులలో పడివుండగా, యీ మానవుడు తన జీవితార్జన అయిన ధనశక్తుల్ని మృత్యు ఘడియల్లో వదలలేక తన బాహుబంధములో బంధించి వేసి, మధ్య మధ్య నారాయణ నామస్మరణ చేయుచున్నాడు. మే మెదుర్కొనుచున్న అసలు కఠోర సమస్య యిక్కడే వున్నదని మీరు గ్రహించవలెను!

"పూర్వం (మన దేవలోకాల దురదృష్టం కొద్దీ) మన వున్నతాధికారులైన ఆది దైవాలు త్రిమూర్తులు, కొందరి భక్తుల 'తమ నామస్మరణ' మహా ప్రీతులకు లొంగి వారికి వరప్రదానాలు గావించి యున్నారు! అందులో ఒక విచిత్ర వుదంతాన్ని తమ ముందు వుంచుచున్నాము!"

"పూర్వం 'క్రూరాత్ముడజామీళుడు నారాయణ యనుచు నాత్మబంధువుఁ బిలువన్' అని ఒక ఆజన్మ పాపి! అయిన వాడు తన మృత్యు సమయమందు యాదృచ్ఛికంగా శ్రీమన్నారాయణుని పేరు ఉచ్చారణ చేసినందున శ్రీమన్నారాయణుడా పాపికి స్వర్గప్రాప్తి కలిగించినాడు!"

"బహుశ మేమెలాంటి విపరీత విపత్కర పరిస్థితిలో వుండి వుందీ మీకిప్పుడు పూర్తిగా అర్థమై వుండగలదని మా నమ్మకము!"

"ఆ శ్రీమన్నారాయణుడు మన ఉన్నతాధికారి. ఆయన ఎట్టి పరిస్థితులలో ఎంత దూరమాలోచించి ఆ పాపికి స్వర్గ ప్రాప్తి కలిగించాడో? అంత మాత్రాన మనము స్వతంత్రముగా అట్టి చర్యనే యీ రాఘవయ్య నామధేయుడి విషయములో తీసుకొనగలమా? యిదొక దీర్ఘాలోచనాంశమని మీరు గ్రహించగలరు!"

"ఇట్టి క్లిష్ట పరిస్థితిలో మా కర్తవ్యమేమిటనే యీ చర్చనీయాంశాన్ని మన వున్నతాధికారులు త్రిమూర్తుల ముందుంచ నిర్ణయించినాము. యీ మా యొక్క సందిగ్ధావస్థ మూలముగానే మన మృత్యు కవాటములు సగమే తెరుచుకుని వుండిపోయినవి."

"ఈ పరిస్థితిలో మన ముందున్నది ఒకే ఒక మార్గమని మేము నిర్ణయించినాము. ప్రస్తుత కాలమునకు ఆ రాఘవయ్య నామధేయుడి సమస్యా పరిష్కారము ఆ భూలోక మానవుల నిర్ణయమునకే వదలుట శ్రేయస్కరమని మీరు గ్రహించగలరు".

* * *

అది రాఘవయ్య గారి భవనం ముందు వున్న పెద్ద ఆవరణ. ఆయనగారి అనేక వ్యాపారాల్లో పని చేస్తున్న అనేక శాఖల వందలమంది శ్రామికులూ ఆఫీసులవారూ అక్కడ గుమిగూడారు. ఆవరణకు ఒక పక్కగా పెద్ద వేపచెట్టూ, ఆ చెట్టు చుట్టూ విశాలమైన నాపరాతి తిన్నె వున్నయ్.

తెల్లటి పొందూరు ఖద్దరు కంటె మెడ జుబ్బా, పంచా పై వుత్తరీయం పాతిక అంగుళం మేర అంటకత్తెర వేసిన సహం నెరిసిన తలా, మందమైన అద్దాలకు మందమైన చట్రమున్న కళ్ళజోడూ, చువ్వల్లే పొడుగ్గా వంకి చేతికర్రతో ముందుకు వొంగి, ఆ వేదిక మీద మాట్లాడ్తున్నది రాఘవయ్య గారి మేనేజరూ, ఆంతరంగికోద్యోగైన వెంకట్రంగయ్య, అందుకై జన్మించాననుకునే పూర్ణ విశ్వాసి.

"బహుశ మీకు తెలిసుండదు, మిమ్మల్నెందుకు యిక్కడ సమావేశ పర్చానో?" అని అందర్నీ ఒకసారి ఎడం నుండి కుడికి అర్ధ చంద్రాకృతిలో దృష్టి తిప్పుతూ చూశాడు వెంకట్రంగయ్య, ముక్కు మధ్యకు దిగిన కళ్ళద్దాల గుండా గంభీరంగా చూస్తూ.

సభలో నిశ్శబ్దం.

"పాపం మన యజమానీ మహాదాతా మెత్తని వెన్నపూస లాంటి మనసు వున్న రాఘవయ్యగారు, ఆరు నెల్ల నుంచీ అస్వస్థతగా వుండడం మీకు తెలుసు. అలా అస్వస్థత ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకూ పాపం, ఆయన మనసు సహం భగవధ్యానంలోనూ,

మిగతా సహం మీ మీదా, మీ శ్రేయస్సు కోసం పరితపిస్తున్నదని నేనంటే మీరాశ్చర్యపడకండి; ఎందుకంటే మరా భగవంతుడాయన్ని అలా సృష్టించాడు!" అంటూ అందర్నీ యింకోసారి కలియ చూసాడు, వెంకట్రంగయ్య.

సభలో నిశ్శబ్దం.

"పాపం, మన రాఘవయ్య గారు పూర్ణారోగ్యం పొంది, ఆయన సహజ మందహాసంతో మనకళ్ళ ముందర మరల సర్వదా కనుపిస్తుండాలని భగవంతుని ధ్యానిద్దాం! అందుకు శాస్త్ర పండితుల్ని రప్పించి భారీ ఎత్తున పూజలూ, భజనలూ, అన్నదానాలూ జరిపించాలని పెద్దల సంకల్పం! అందుకు మీ సంపూర్ణ సహకారం లభించి, పూజలు వగైరా దివ్యంగా జరిపించగలరని నా దృఢ నమ్మకం!" అంటూ మరొక పర్యాయం సభంతా చూశాడు వెంకట్రంగయ్య.

సభలో నిశ్శబ్దం.

"మీ బుద్ధి నాకు బాగా తెలుసు! నేను తెలిపిన పెద్దల సంకల్పం గురించి మీ అభిప్రాయం ఏమిటని అడుగుతున్నా?" చెప్పాడు వెంకట్రంగయ్య.

"ఏ అభిప్రాయం?" అడిగారు, సభలోంచి.

"మీ సహకారం గురించి!" చెప్పాడు వెంకట్రంగయ్య.

"ఏ సహకారం?" అడిగాడు సభలోంచి.

"వింతగా వుంది! లోగడ నేను కొన్ని సందర్భాల్లో మీ సహకారం అడగడం, వెంటనే అది లభించటం గుర్తు చేస్తున్నాను. యింకా బాగా గుర్తుండేందుకు అయ్యగారి చిరంజీవులైన ప్రధమ, ద్వితీయ పుత్రుల వివాహ సందర్భంలో ఆ సహకారం అందచేసినట్టు గుర్తు చేస్తున్నాను - వూఁ తేల్చండి మరి?" చెప్పాడు వెంకట్రంగయ్య.

"ఎర్రి మొగాల్లార, ఏంది అట్ట సూత్తారు, మాట్టాడండి మరి-?" అన్నారొకరు సభలో.

"ఎవర్ది ఎర్రి మొగం, ఓ సెంప రెణ్ణెల్ల జీతం డబ్బులు బకాయి పెట్టి కూకుంటేనూ?" అన్నారు మరొకరు, సభలో.

"పాపం, మన రాఘవయ్య గారు మీతో మరీ మరీ చెప్పమన్నారు, అనారోగ్య కారణంగా జాప్యం జరిగిందనీ, మీ జీతాలు ఏ రోజు మీకందినా అందవచ్చనీ చెప్పమన్నారు. ఆయన మనసు మీకు తెలుసు" అన్నాడు వెంకట్రంగయ్య.

"జీతం డబ్బులిత్తే నాలుగు మెతుకులు తిన్నాక పూజ లెవారం సూడచ్చులెండి!" అన్నారు సభలో.

"పాపం అహర్నిశలూ మిమ్మల్నీ మీ కుటుంబాల్నీ పోషిస్తున్న ఆ ధర్మదాత యివాళ రోగంతో పడుంటే మీరా విధంగా నిలవదీయటం అధర్మం! యీ విషయం తెలుస్తే ఆయన మనసెంత క్షోభిస్తుందో మీకెలా తెలుస్తుంది?" తన విచారం తెలిపాడు, వెంకట్రంగయ్య.

"ఇంతకీ మమ్ముల్నాయన వూరకనే పోషిత్తున్నాడంటయ్యా నువనేదీ?" అడిగారు సభలోంచి.

"రామ రామ! అలా మీరనుకోటమే వెర్రితనం అనంటాను! ఆయనకు సర్వాధికారాలున్నా మిమ్మల్నే ఎప్పుడూ పనిలో ఎందుకు పెట్టుకుంటున్నారో మీరేనాడైనా ఆలోచించారా? దీని అర్థం ఏమిటి?" అని సభను ప్రశ్నించాడు, వెంకట్రంగయ్య.

"మేం ఎప్పుడు గిట్టకబోయినా పన్లోంచి వూడబెరికి ఎల్లమంటానే వుండిరిగా?" అన్నారు సభలోంచి.

"చీమ చిన్నదైనా కుడ్తే విలవిల్లాడిపోతాం, అవునా? మన రాఘవయ్యగారు పెద్ద వ్యాపార సంస్థలకు అధికారి. ఆ సంస్థలన్నీ తన శరీరం తాలూకు అంగ, ఉపాంగాలుగా భావిస్తాడాయన. ఏ అంగం వద్ద పనివారాయన్ని చీకాకు పర్చి పని కుంటుపర్చినా ఆ చీమల్నల్లే వార్ని విసర్జించక తప్పటం లేదు మరి – అయినా యిదంతా అప్రస్తుతప్రసంగం అనుకోండి – యిహ అసలు విషయానికొద్దాం–" అంటూ సభవేపు చిన్నగా నవ్వాడు, వెంకట్రంగయ్య.

* * *

ఏ వేపు చూసినా నున్నగా తళతళ మంటూ విశాలంగా వున్న ఆ గదిలో పెద్ద మెత్తటి పట్టె మంచం మీద ఆరునెల్ల నుండీ మృత్యువు నెదుర్కొంటున్న కోటీశ్వరుడు రాఘవయ్య గారు పడుకునున్నాడు, అక్కడ సమావేశమైన తన ఆంతరంగీకుల్నీ ఆప్తుల్నీ చూస్తూ.

అక్కడ సమావేశమైంది వెంకట్రంగయ్య లాంటి డజను మంది మేనేజర్ల నదుపు చేయగల శక్తిపరుడూ ఆంతరంగిక ఉన్నతాధికారైన సుబ్బారాయుడూ, మేనేజరు వెంకట్రంగయ్యా, రాఘవయ్య గారి భార్య రామలక్ష్మి, కొడుకులు రఘునారాయణ, రామనారాయణ, రాజనారాయణలూ, కూతురు అరుణా వున్నారు.

"నా పడక కుదర్డం లేదు – తీసెయ్యండి–" అన్నాడు రాఘవయ్యగారు, లోతైన బావిలో పడినవాడి గొంతల్లే వున్న పీల గొంతుతో.

"తమకు వేసిన ఆ మెత్త 'ఇంపోర్టెడ్ ఫోము'దండీ. అంతకన్న సుఖంగా వుండే మెత్త ఏ మానవమాత్రుడికీ అంత తేలిగ్గా లభించటం అసాధ్యం!" అన్నాడు, పచ్చగా

నున్నగా పండల్లే పండి, ఆ బట్టతల నెత్తిన స్వల్పంగా మిగిల్న శ్వేతజాతి జట్టు పరకల్తోనూ అదేజాతి వస్త్రాలతోనూ, ఆ గరుడముక్కుపై స్వర్ణ సులోచనాల్తోనూ వున్న సుబ్బారాయుడు.

"నీ బుర్ర పెద్దది - లోపల సరుకు చిన్నది - మార్చండి పడక" అన్నాడు రాఘవయ్యగారు, కసుర్తూ.

ఫోము పడక మార్చి మెత్తటి కృత్రిమ జూలు రొజాయి మీద ఆయన్ని పడుకోపెద్తుంటే, అదీ వద్దని మూలిగి, ఆ స్ఫటికాల్లాంటి పాముకళ్ళతో చురచుర చూస్తున్న రాఘవయ్యగార్ని చివరకు కటిక పట్టె మంచమ్మీదే పడుకో పెట్టారు, అందరూ కలిసి.

"ఎంత ధనం, ఎన్ని భోగాలున్నా ఏం ప్రయోజనం, అనుభవించంది? ఏనాడూ యింత తింటానిక్కూడా నోచుకోలేదు - యీనాడేదీ యిమడకనేపోయె - చివరకు ప్రాణానికి కొంత సుఖమన్నా వుంటుందనుకున్న మెత్తటి పక్క కూడా వొద్దంటున్నారు - ఏమి చేయను?" అంటూ గుడ్లనీరు కుక్కుకుంది భార్య రామలక్ష్మి.

కొంచెం తేరుకున్నాక, సుబ్బారాయుడూ వెంకట్రంగయ్యలను ప్రశ్నార్థకంగా చూశాడు, రాఘవయ్యగారు.

"చిత్తం, తమ మనసు గ్రహించి, వెంకట్రంగయ్య సభను ఏర్పాటు చేయించి వార్ని అడగటమైంది, బకాయిలో వున్న ఆ రెండు నెలల జీతాలు - ముందర అందాలన్నారు-" అన్నాడు సుబ్బారాయుడు, మాటలు నెమరేసుకుంటూ.

"చిత్తం, తమ అస్వస్థత కారణంగా జీతాలివ్వటంలో స్వల్ప జాప్యం జరిగిందనీ, రేపో మాపో యివ్వనున్న ఆ రెణ్ణెల్ల జీతాల్లోంచి పూజల తాలూకూ చందా తగ్గించుకుంటే, వారికీ అంతగా ఏమీ అనిపించదనీ నచ్చ చెప్పాను!" వివరాలు తెలిపారు వెంకట్రంగయ్య.

"ఓ పదిమంది ఎదురు తిరిగి, మిగతావార్ని రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తుండగానే వార్ని వెంటనే అక్కణ్ణుంచి తరలించాము. కాని వారు మనకు చాలా కాలం నుండి కావలసిన వారై వుంటంలో సమయం సద్వినియోగపర్చుకునేందుకు వార్ని రైటింగు కేసుల్లో యిరికించాల్సొచ్చింది మరి-" సారాంశం తెలిపాడు, సుబ్బారాయుడు.

"చూశారా సుబ్బారాయుడుగారూ - నీతి నిజాయితీ న్యాయం, ధర్మం - ప్రత్యక్షంగా మనకళ్ళ ముందర ఎలా అమలు జరుగుతున్నదో." అన్నాడు రాఘవయ్యగారు, క్షీణ స్వరంతో.

"చిత్తం, తమ ఆంతర్యం-." గుటక మింగాడు సుబ్బారాయుడు.

"ఎన్ని ఏళ్ళ నుంచో నా పరిశ్రమల్లో పని చేస్తున్నవార్ని ఎక్కడా నాగా అంటూ లేకుండా - (కొన్ని విషమ పరిస్థితుల్లో మినహాయించి-) ప్రతి నెలా వారి వారి జీతాలు పువ్వుల్లో పెట్టి యిస్తూ రావడం మీకు తెలుసు గదా? ఆ డబ్బుల్తో వారి వారి భార్యాబిడ్డలు

– ఎంత సుఖంగా జీవిస్తున్నారో మీరు చూస్తున్నారు గదా? స్ట్రయికులంటూ చేసినప్పుడు గత్యంతరం లేక కొందర్ని బయిటికి పంపుతే – పాపం, వారి భార్యాబిడ్డలొచ్చి నా కాళ్ళావేళ్ళా పడ్తుంటే – నేనెంత బాధపడేవాడినో మీరు గమనిస్తుండేవారు గదా? నన్ను వేధించటానిక్కాకబోతే – యివాళ వారలా అఘాయిత్యం చేయడం దేనికి చెప్పండి?" అన్నాడు రాఘవయ్యగారు, విచారంగా.

"చిత్తం, తమ మనసు వెన్నపూస లాంటిదని లోకం అనుకుంటుంది!" అన్నాడు సుబ్బారాయుడు.

"తమ సత్వర పూర్ణారోగ్య నిమిత్తం భగవాన్ ప్రార్థనలూ, పూజలూ హోమాలూ జరిపించేందుకు ఫిట్టర్లు, టింకర్లు, మెల్డర్సు, ఆయిల్‌మన్‌లు, డ్రిల్లర్లు, వెండర్లు, ఫోర్‌మన్‌లు, డ్రయివర్లు, హెల్పర్లు, కూలివారు; ఇంజనీర్లు, ఆఫీసు గుమాస్తాలు వగైరా మొత్తం పదివేల మంది నుండి, తాహతులు వారీగా, అయిదూ, పదీ ఇరవైవేలు వారికి ముట్టవలసిన రెండు నెలల జీతాల నుండి పూజల చందా మినహాయింపులు ఏర్పాటు చేశాము!" వివరాలు తెలిపాడు, వెంకట్రంగయ్య.

"నేను నిమిత్త మాత్రుణ్ణి – ఈశ్వరాజ్ఞ లేంది ఈగైనా ఎగరదు. మీరు వెళ్లిరండి–" అన్నాడు రాఘవయ్యగారు, తన కుటుంబ సభ్యుల వేపు తలతిప్పుతూ.

"మిమ్మల్ని యివాళ ఎందుకు పిలిపించానో మీకు తెలిసే అవకాశం లేదు – కాని కొన్ని వూహలు చేయగలరు – ఆరు నెల్ల నుండీ నేనీ మంచం మీద వేళ్ళాపడ్తుండం వల్ల" కుటుంబంతో మాట్లాడడం ప్రారంభించాడు, రాఘవయ్యగారు.

"నా జీవితం ఒకే ధ్యేయం, ఒకే లక్ష్యంతో నడిచింది. ధనార్జనకు నేను చేసిన వ్యాపారాలూ, అందుకు తీసుకున్న చర్యలూ అన్వేషించని మార్గాలూ బహుశ దిగవిడిచినవేమీ మిగిలుండవు! ధనశక్తిని మించిందీ అది సాధించనిదీ యీ భువిలో మరేదీ లేదనే జ్ఞానం చిన్ననాటి నుండీ నాలో పెంపయి, లోతుగా నాటుకుపోయింది! యీ జ్ఞానార్జన గురించి ఎవరైనా తప్పుపడ్తే వాళ్ళను వెర్రికట్టెల కింద జమకట్టండి! యీ జ్ఞానం నాలో ఒక నిత్యాగ్నిహోమం, నాకొక వుక్కుకవచంగా పని చేసింది!

"నేను నిజంగా వ్యాధిగ్రస్తుణ్ణే, ఏనాడో మృత్యువాత పడవలసిన వాణ్ణి కూడా; నిదర్శనకు నా డాక్టరు స్పెషలిస్టులే సాక్ష్యం! కాని, ధనార్జనాగ్ని నాలో ఎంత బలమైన శక్తిగా రూపొందిందంటే, నన్ను కబళిద్దామనొచ్చిన మృత్యు దేవతను సైతం తారెత్తించి పరుగెత్తించిందని నేను నమ్మిన సత్యం! యీ సంఘటనపై శాస్త్ర పరిశోధనలు జరుగుతే నేనాశ్చర్యపడను! కమ్మని సంగీతం వింటే ఆవులు అధికంగా పాలిస్తయ్యని శాస్త్రజ్ఞులు రుజువు చేశారు! నా మనస్థితీ ఆ తెగదై ఎందుకుండగూడదు?"

"పిచ్చి ముండాకొడుకులు - తాము వైద్యంలో స్పెషలిస్టులమని ఆ డాక్టర్లు విర్రవీగుతున్నారు! కాని నా వ్యాధి స్థితి ఒకందాన వారికంతుపట్టక గింజుకు ఛస్తున్నారు - బైట పెట్టరు గాని!"

"కాని, నా యీ కృత్రిమస్థితి ఎక్కువ కాలం నిలిచేది కాదు - నా సహజ జీవశక్తులు నాలో ఎప్పుడో ఆరిపోయినందువల్ల. నేను దాటిపోయేముందు నేనార్జించిన ధనశక్తుల (యిది డబ్బుకు నా వాడుక పదం) పరిరక్షణకు మీ వారసత్వాల్ని గుర్తుచేసి; కొన్ని హెచ్చరికలు మీతో ముఖాముఖి తెలుపటమే నా కడసారి కోరిక. ఆ కోరిక తీర్తే, నా ప్రాణి సుఖంగా వెళ్ళిపోతుంది!" అని తన రక్తబీజాలున్న తన కుటుంబాన్ని ఆశగా చూశాడు, రాఘవయ్యగారు.

"మీ కోరిక తీరేందుకు మా ప్రాణాలొడ్డుతాం, చెప్పండి మీ కోరిక" ముక్తకంఠంతో తెలిపారు కుటుంబ సభ్యులు, ఒక్క కూతురు అరుణ తప్ప.

ఈ అపశృతి రాఘవయ్యగారు గమనించకపోలేదు.

"రఘునారాయణా, నీకు స్త్రీ వ్యసనం, మధుపానం పట్ల రంధి ఎక్కువ! కాని నీతి అవినీతుల్ని గురించిన వ్యర్థచర్చలు చేసే నైజం కాదు నాది! నీ అభ్యాసాలకు ధనావసరం మెండు. అందుకు నీ శక్తి ధారపోస్తావని నా నమ్మకం; కనుక నా ఆస్తి రక్షణకు వుండవలసిన బీజాలు నీలో వున్నయ్! కాని యిందుకు తోడు నువు దైవ కార్యాలు బహిరంగంగా ఎంత పెంచుకుంటే నీ స్థితికి అంత పుష్టి ఏర్పడుతుందని అనుభవపూర్వకంగా నా సలహా" అంటూ జ్యేష్ఠ కుమారుడితో ప్రారంభించాడు, రాఘవయ్యగారు.

"రామనారాయణా, నీలో గుఱ్ఱం పందేల దీర్ఘవ్యాధి నీ రోమ రోమానికీ పట్టింది! గుఱ్ఱాలు పరుగెత్తగలవనే విషయం మినహా వాటికి కొమ్ములున్నయ్యో, ఏ కాళ్ళు బాగా ఎత్తుతయ్యో తెలుసుకునే వ్యవధి నాకు దొరికింది కాదు. నీలో కూడా ధనావసర బీజాలున్నయి గనుక నీ అన్నకు చెప్పిందే నీకూ చెల్లుతుంది" అని మూడవ కుమారుడి వేపు తిరిగాడు, రాఘవయ్యగారు.

"రాజ నారాయణా, ఉదయం 11 గంటలకు నీకు మన ఇంట్లో తెల్లవారి, కాలకృత్యాలూ జపతపాలూ అల్పాహారాలతో నీ నిత్య జీవిత కార్యక్రమాలు క్లబ్బులో ప్రారంభమౌతయ్యనేది జగద్విదితం! నీకూ ధన తృష్ణ వుందిగాని అందుకు కావలసిన అమూల్య కాలవ్యవధి క్లబ్బుల పాలవుతున్నదనే చింతే నన్ను వేధిస్తున్నది. నా ఆర్జన సంప్రదాయాన్ని నువు నిలపలేవేమోనని నాకు సందేహాలున్నయ్, ఏమిటి నీ సమాధానం?" అడిగాడు రాఘవయ్యగారు, మూడో కొడుకును.

"నాన్నగారూ, మనదేశంలో మన సమాజంపై ఆర్థిక యాజమాన్యశక్తులున్న పెద్దలకు కూడలి స్థలం క్లబ్బులు! యీ పెద్దల సంపర్కాలూ మైత్రీ మనిషి మనుగుడకు క్షేమం అనీ, వ్యాపార దక్షతకు యీ అభ్యాసం మొదటి మెట్టని నేను గ్రహించి, యీ పద్ధం తను సరిస్తున్నానని మనవి!" వివరించాడు రాజనారాయణ.

"నాయనా రాజనారాయణా, కొన్ని అమృత వాక్కులు నా చెవిన వేశావు! యింక నీ గురించి నాకే శంకా లేక అనుమానాల్ని రద్దు చేసుకుంటున్నాను. యిక మీ ముగ్గురు సోదరులు వెళ్ళవచ్చు" అని భార్య రామలక్ష్మి వేపు చూశాడు, రాఘవయ్యగారు.

"రామలక్ష్మీ! నిన్ను నేను ఏనాడూ నీ తిరుగుళ్ళ నుండి అదుపు చేసేందుకు ప్రయత్నించలేదు. నాకూ ఆ అలవాట్లు కొన్ని వుంటంవల్ల నీకు నేను న్యాయం చేసే వెళ్తాను. నీకు కావలసిన సంఘాల్లోనూ, యితర పార్టీల్లోనూ పూర్వంలాగా నువు యథేచ్ఛగా నీ కాలం వెళ్ళపుచ్చవచ్చు - యిక నువు వెళ్ళు" మెడ తిప్పి కూతురు అరుణను చూశాడు రాఘవయ్యగారు.

"నువు పూర్తిగా చెడిపొయ్యావు!" సూటిగా ప్రారంభించాడు రాఘవయ్యగారు, అరుణ కళ్ళలోకి చురచుర చూస్తూ.

"ఏవిధంగానో చెప్పండి?" అడిగింది అరుణ, కొంచెం ఆశ్చర్యపడుతూ.

"నువొక గాంగులీడరూ దగుల్బాజీ సామ్యవాద కుట్రదారుతో బుజాలు పూసుకుంటూ వాడి కొంప వెంట తిరుగుతున్నావని తెలిసింది - కాని నువు అదొక సరదాగా భావిస్తుంటే మటుకు - అది వేరే విషయం!" అరుణ కళ్ళల్లోకి పరీక్షిస్తూ చూశాడు, రాఘవయ్యగారు.

"నాకు ఎవరి బుజాలూ పూసుకుంటూ ఎవరి కొంప వెంటా తిరిగే సరదా అలవాట్లు లేవు నాన్నగారూ. మీరెవర్ని గురించో పొరపాటున నాతో అంటున్నారనుకుంటా" అంది అరుణ.

"నేను వ్యర్థ ప్రసంగిని కాను, అరుణా. నేనెవర్ని గురించి మాట్లాడుతున్నదీ, ఆ వ్యక్తి ఎవరైంది కూడా నీకు బాగా తెలుసు. నువు మన అంతస్తుకు తూగే ఎవరెంట తిరిగినా నాకు బాధ కలగదు. నువా బజారు గాడిద, పచ్చి రౌడీ, నా పనివాళ్ళను లేపి, వారి వెనక నుండి నాకు వ్యతిరేకంగా సమ్మెలు ఎగదోసే పుంధాకోరు, రామశర్మ వెంట నువు పడటం వల్ల నా తల ఎక్కడ పెట్టుకున్నానో నీకు తెలుస్తుందా? యిప్పుడు చెప్పు నీ సభ్యతేమిటో?" క్షీణ స్వరంతో అరిచాడు, రాఘవయ్య.

"ఇప్పుడర్థమైంది ఎవర్ని గురించి మీరు మాట్లాడుతున్నదీ! రామశర్మ నా బాల్య స్నేహితుడు. మీరుపయోగించిన దుర్భాష అతన్నంటదని నాకు బాగా తెలుసు! అతను

మానవతావాది, నిస్వార్థి, సంస్కారం వున్న విద్యాధికుడు, యింకొకరి కష్టాలు తనవిగా భావించి శక్తికొద్దీ వారిని ఆదుకోగలడని మటుకే అతన్ని గురించి నాకు తెలుసు. అతని నిత్య కార్యకలాపాల్ని గురించి నేను ఆరాలు తీయను. తీసినా అతన్ని గురించిన నా అభిప్రాయాలు మారే అవకాశం లేదు. ఎవరి అంతుస్తుల్ని బట్టి వారితో వూరేగే సభ్యత నాకింకా అబ్బలేదని కూడా మీకు తెలుపగలను" అన్నది అరుణ స్ఫుటమైన మాటల్తో.

"పూర్తిగా అర్థమైంది, నీ అడుక్కుతినే సభ్యత! మీ అమ్మ కన్న నీకబ్బిన వంశభ్రష్టమైన సభ్యత రెండాకుల ఎక్కువ మోతాదులో వుంది! మన సంస్కృతీ మన సాహిత్యం మన కళలంటూ మీ అమ్మ ఎన్ని గడపలు తొక్కినా కొంచెం లౌక్యం కనబర్చేది! నీ సంస్కారం పచ్చి నాటురకం - ఆరుబయట సరుకు - నేనాశించే నా రక్తం నీలో మచ్చుకైనా లేదు - నా సంపదలో భాగం అనుభవించే యోగ్యత నీకు లేదు - నాదనే చిల్లిగవ్వ కూడా నీకు దక్కదు - ఫో" ఆవేశంలో రాఘవయ్య గారి కళ్ళు మసగలై - చీకట్లు కమ్మినై.

* * *

"మా నాన్న నిన్నూ, నన్నూ చాలా హీనంగా దూషించాడు!" అన్నది అరుణ, రామశర్మతో దాపరికం లేకుండా.

"బహుశ నువు నాతో బహిరంగంగా తిరగటం మీ నాన్న పరిభాషలో మహా దోషమై వుంటుంది - యీ విషయమై నిన్నెపుడో హెచ్చరిద్దామనుకున్నాను అరుణా - కాని నాది స్వార్థబుద్ధి నన్ను తప్పు పట్టకు... అన్నాడు రామశర్మ.

"లేదు లేవయ్యా, అందులో మన యిద్దరి స్వార్థం వుంది గనక నిన్నొక్కణ్ణే తప్పు పట్టుకోకు మరి! రామశర్మా, యివాళ మా నాన్న మనసు చూసినంతగా ముందు ఏనాడూ అంత అవకాశం కలగలేదు! ఆయనెప్పుడూ తన వ్యాపారాల్లో మునిగితేల్తూ ఏ అర్థరాత్రో యింటికి వస్తుండం వల్ల మా మధ్య వుండవలసిన సాన్నిహిత్యం ఏనాడూ లేకుండా పోయింది! యిన్నాళ్ళు దూరంగా వుండిపోయిన నాకు ఆయనెంతో గొప్ప వ్యక్తిగా కనుపించేవాడు. యిన్నాళ్ళు ఆయన రోగాన పడున్నా ఆయన వ్యాపార వ్యవహారాలు ఆ రోగి పడక దగ్గరక్కూడా వెంటాడ్తుండటం వల్ల మమ్మల్నిక్కడక్కూడా పిలిచెరగడు! యివాళ నాకా కొరత తీరింది!" అన్నది అరుణ, విచారంగా.

"మీ నాన్న కోటీశ్వరుడు. ధనికుడనేవాడు అనేక మందికి అనేక రూపాల్లో కనుపిస్తాడు! యీవాళ నువు తండ్రిగా ఆయన్ని ముందుకన్న దగ్గరగా చూశావు. కాని ప్రథమంగా ఆయన మనసు నీ ముందు విప్పడం వల్ల నువు ఆశించిన లేక వూహించిన నీ తండ్రికి మారుగా యింకొక వింత రూపాన్ని చూసి వుంటావు! కారణం, నీ తండ్రి సంస్కారానికి పూర్తిగా భిన్నమైంది, నీ సంస్కారం.

"బ్రహ్మాండమైన 'కాడిలాక్' కార్లో పోతుంటే వీధి జనానికి ఆయన 'పూర్వజన్మ సుకృతుడు'గానూ, మీ భవనం అంతస్తుల మీద కనుపిస్తే 'లక్ష్మీవరపుత్రుడు'గానూ, సభల్లో అగ్రపీఠమలంకరించి 'జాతకుడుగానూ' దగా సంస్థలకు దాతగానూ, లంజకు ధనరాశిగానూ, ఆఫీసు మేనేజర్లకు దీనబంధువుగానూ, ఫాక్టరీ శ్రామికులకు 'విలన్'గానూ, భార్యా కొడుకులూ కూతుళ్ళకు (నిన్ను మినహాయిస్తున్నా) నిండు పర్సుగానూ సాక్షాత్కరిస్తాడు!" అన్నాడు రామశర్మ.

"అర్థమైంది నీ చమత్కారం – చాలు! నాన్న తన ఆస్తి నుండి ఒక్క చిల్లిగవ్వయినా నాకివ్వనన్నాడు!" బయటపెట్టింది అరుణ.

"మీ తండ్రి తన స్వార్జితంపై సర్వాధికారి!" అన్నాడు రామశర్మ.

"నా తండ్రీ తల్లీ అన్నయ్యలు రోజూ డబ్బునేవిధంగా వాడుకుంటున్నదీ అది ఎలా ఆర్జించపడ్తున్నదీ కొంత నేను ప్రత్యక్షంగా చూసినందువల్లనో ఏమో, నాకు ధన ద్వేషం పుట్టిందని యివాళ రూఢిగా తెలుసుకున్నా! నాన్న చిల్లిగవ్వన్నా యివ్వనంటుంటే నాకు చీమకుట్టినట్టన్నా అనిపించలేదు! నేను మా వంశంలో చెడబుట్టినట్టుంది!" అన్నది అరుణ.

"అరుణా, నీలో నేను నిజమైన మానవ రూపం సాక్షాత్కరించటం చూస్తున్నా!" అంటూ అరుణ మెత్తటి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు, రామశర్మ.